క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని షార్కీ బాలికల వసతిగృహంలో 100 మంది విద్యార్థినులకు మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, ఆర్థిక సాయం అందించారు. సంస్థ ప్రతినిధులు ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవాన్ని వసతిగృహంలో ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ మదర్ థెరిస్సా స్ఫూర్తితో తమ సంస్థను స్థాపించి ఏడాది కాలంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ నిర్వాహకులు ఏఆర్‌కే వరప్రసాద్, కె. వేణుకుమార్, డి. రాధాకృష్ణ, ఎస్. శివ, బి. గంగయ్యనాయుడు, జి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి వస్తువుల సమర్పణ



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విజయవాడ గుణదల వాస్తవ్యులు డాక్టర్ పీపీ లలిత్ కుమార్ దంపతులు ఆదివారం 580 గ్రాముల విలువగల వెండి వస్తువులు సమర్పించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న దాతలు స్వామివారికి కానుకగా వెండి పళ్లెం, మూడు వెండి గిన్నెలను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందచేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కోలాహలంగా పోతురాజు జాతర



రేమాలవారిపాలెం(నాగాయలంక): పేర్లవానిలంక గ్రామంలో పోతురాజు స్వామి దేవస్థానం వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోతురాజు స్వామి శిలలకు నాగాయలంక శ్రీరామ పాద క్షేత్రం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో శుద్ధి పూజలు జరిపారు. అనంతరం గ్రామానికి తరలించి ఆచారవంతుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాల కావళ్లతో భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం పోతురాజు శిలలకు గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దలు పేర్ల గోవిందరామయ్య, పేర్ల భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నారాణి రాజీనామా

పెడన: పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్రకు ఆదివారం అందచేశారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్‌లో 23 మంది సభ్యులకు గాను 21 మంది వైఎస్సార్ సీపీ సభ్యులు ఉన్నారు. మొదట చేసుకున్న ఒప్పందం మేరకు తొలి రెండున్నర సంవత్సరాలు ముగియడంతో జోత్స్నరాణి రాజీనామా చేశారు. సోమవారం జరుగనున్న కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆమె రాజీనామాను ఆమోదిస్తారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మోపిదేవి: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రేపు విద్యార్థులకు అవగాహన సదస్సు

గుడివాడరూరల్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ సింగిల్ మేజర్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ ఆదివారం తెలిపారు. స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు డాక్టర్ సీవీ రామ్మోహనరావు సెమినార్ హాల్‌లో విద్యార్థులకు నిర్వహించే ఈ సదస్సులో పాల్గొనాలన్నారు. తమ భవిష్యత్ అవసరాలకు అనువైన విద్యా కోర్సులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గాయపడిన వ్యక్తికి రక్తదానం

గుడివాడ టౌన్: గాయపడిన వ్యక్తికి రక్తదానం చేసి ఆర్‌కే వారియర్స్ సభ్యులు ప్రాణాలు కాపాడారు. ఆదివారం నాగవరప్పాడుకు చెందిన షేక్ మస్తాన్ ప్రమాదానికి గురై గాయాలపాలై రక్తం కోల్పోవడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రక్తదాతలకు సమాచారం అందజేశారు. దీంతో స్పందించిన వారియర్స్ గ్రూప్ సభ్యులు మెండా గంగాధరరావు, కిరణ్ స్పందించి రక్తదానం చేశారు.

సొంతిల్లు సాకారం దిశగా అడుగులు



● మండలంలోని మడక గ్రామానికి చెందిన ఈమె పేరు మోపిదేవి లక్ష్మీ. ఈమె భర్త శివ బల్లిపర్రు గ్రామంలో టైలరింగ్ చేస్తూ భార్య, పిల్లలను పోషిస్తున్నాడు. భార్య లక్ష్మీ గృహిణి. బల్లిపర్రులోని అద్దె ఇంటిలో ఉంటూ సొంత ఇంటిని మడక గ్రామంలో నిర్మించుకున్నారు. మొట్టమొదటి ఇల్లుగా నిర్మాణం పూర్తి చేసుకుంది. వీరి ఇంటిని మండలంలో మోడల్ ఇంటిగా చూపించేందుకు మొట్టమొదటిగా ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. వీరి ఇల్లు ఆదర్శంగా చూపిస్తున్నారు. గృహ ప్రవేశం చేసి తమ సొంత ఇంటి కల నేరవేరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు ఈ దంపతులు.




● ఈమె పేరు సంగడి నూకారత్నం. భర్త పేరు వీరవెంకటరత్నం. నేత కార్మికునిగా జీవనం కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు సొంత ఇల్లు లేదు. వీరు పెడన పురపాలక సంఘ పరిధిలోని బ్రహ్మపురంలో గత పదేళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు ఇల్లు కూడా కట్టిస్తోంది. పట్టణానికి సమీపంలోని పైడమ్మ లే అవుట్‌లో ఇంటిని నిర్మించుకుంటున్నారు. ఇంత కాలం తరువాత సొంత ఇంటి కల నేరవేరుతుండటంతో వీరు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

- వేగంగా ఇళ్ల నిర్మాణాలు
- కొన్ని ఇళ్లు నిర్మాణం పూర్తి, శ్లాబ్ దశలో మరికొన్ని..
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పైడమ్మ లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



పెడన: సొంతింటిలో నివశించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. పేదలకు మాత్రం అది కలగానే మిగులుతోంది. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో పెడన నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు. ఎన్నికల ముందు టిడ్కో ఇళ్లను మంజూరు చేసినా అవి పెడన నియోజకవర్గం వరకు రాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి ముఖ్యమంత్రి అయిన తరువాత అనేక పథకాలు అమలు చేస్తున్నారు. పేదలకు సొంత ఇల్లు సమకూర్చాలన్న లక్ష్యంతో ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మిస్తున్నారు. పెడన పట్టణంతో పాటు పెడన మండలంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలు కొత్త ఊళ్లుగా మారుతున్నాయి.

40 లే అవుట్ల ఏర్పాటు..

2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేల సంఖ్యలో లబ్ధిదారులు ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్నారు. పెడన పురపాలక సంఘ పరిధిలో పైడమ్మ జగనన్న లే అవుట్‌తో పాటు పల్లోటి వన్, టూ లే అవుట్లను ఏర్పాటు చేశారు. మండలంలోని సుమారు 40 లే అవుట్లను ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఈ లే అవుట్లలో 2,517 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. సుమారు 2,500లకు పైగా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లోనూ, పూర్తయిన ఇళ్లు ఉన్నాయి.

ఇవి కాకుండా సొంత స్థలాలలో ఇల్లు కట్టుకుంటామని గృహ నిర్మాణ శాఖకు దరఖాస్తు చేసుకోగా వాటిల్లో కూడా ఇళ్ల నిర్మాణాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ప్రతి పేదవాడు తన సొంత ఇంటి కలను నేరవేర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.



పెడన మండలం మడక జగనన్న లే అవుట్‌లో పూర్తయిన ఇల్లు

ఇళ్ల నిర్మాణం ఇలా..

పెడన పురపాలక సంఘం నాలుగు లే అవుట్లు, పెడన మండలంలో 36 లే అవుట్లు మొత్తం 40 లే అవుట్లు వేశారు. పెడన పురపాలక సంఘంలో 2,139 మందికి స్థలాలు మంజూరయ్యాయి. వీటిలో నిర్మాణంలో ఉన్నవి 2,137, పునాది దశలో ఉన్న ఇళ్లు 688, గోడలు పూర్తయినవి 333, శ్లాబులు పూర్తయినవి 67, అసలు నిర్మాణం ప్రారంభించనివి రెండు, పూర్తయిన ఇళ్లు 236 ఉన్నాయి. పెడన మండలంలో మంజూరైన ఇళ్లు మొత్తం 378, నిర్మాణంలో ఉన్న ఇళ్లు 370, పునాది దశలో ఉన్న ఇళ్లు 117, గోడలు పూర్తయిన ఇళ్లు 30, శ్లాబులు పూర్తయిన ఇళ్లు ఏడు, ఇళ్ల నిర్మాణం పూర్తయినవి 109, అసలు ప్రారంభించని ఇళ్లు ఎనిమిది ఉన్నాయి.

రేపు సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఈ నెల 20వ తేదీన ప్రారంభించనున్నట్టు గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన మూడవ సచివాలయం భవనాన్ని, ఒకటవ సచివాలయ పరిధిలో రూ.23.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తారని పీఆర్ ఏఈ ఎన్.శివరామకృష్ణ తెలియజేశారు.

మహా కుంభాభిషేకం పూజలు ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం తూర్పు బజారు కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య స్థాపన, వాస్తు హోమం అకల్మష హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. రొంపిచర్ల జనార్ధన భట్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్త శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు వేదాంతం బాలాజీ, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలబాలికలకు ఫెన్సింగ్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ పోటీలను జరిపారు. అనంతరం విజేతలకు ప్రజ్ఞ స్కూల్ డైరెక్టర్ పవన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, దేవరపల్లి విక్టర్‌బాబు, శిక్షకులు దనియాల నాగరాజు, రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో వ్యాధులు దూరం

కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బాలాజీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యోగా సాధకులు

మచిలీపట్నంటౌన్: యోగాతో వ్యాధులు దూరమవుతాయని, ప్రతి ఒక్కరూ యోగా, నడకను సాధన చేయాలని కృష్ణా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ తోట బాలాజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యోగా సభ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట సమయాల్లో సైతం యోగా సాధకులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. యోగా ఉపయోగాలను వివరించారు. అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు బొర్రా విఠల్ మాట్లాడుతూ నేటి తల్లిదండ్రులు పిల్లలను ఏసీ గదులకు పరిమితం చేయడం వల్ల చిన్న వయస్సులోనే గుండె పోటుకు గురవుతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడే విధానాన్ని పెంచుకోవాలని, యోగాను దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ యోగా సభ అధ్యక్షుడు పల్లపోతు కృష్ణ మాట్లాడుతూ యోగాతో మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందన్నారు. యోగా గురువులు ఘంటసాల గురునాథబాబు యోగా ప్రాధాన్యతను తెలిపారు. యోగా గురువు మద్దాల చింతయ్య, ముదిగొండ శాస్త్రి, లంకిశెట్టి బాలాజీ, తమ్మన సూర్యనారాయణ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒప్పంద కార్మికురాలి మృతి



నాగమణి (ఫైల్)

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటనపై ఆదివారం గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం...మండలంలోని బుద్ధవరం గ్రామానికి చెందిన దుంపల నాగమణి(35), ఆమె భర్త వెంకటేశ్వరరావు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన డ్యూటీకి వెళ్లేందుకు ఇంటి నుంచి బైక్‌పై ఇద్దరూ బయలుదేరారు. అజ్జంపూడి వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన వ్యాన్ బైక్‌ను తగిలి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

టెన్త్ టాపర్లకు సన్మానం



సత్కరిస్తున్న చైల్డ్ హుడ్ గ్రూప్ నిర్వాహకులు

అవనిగడ్డ: నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను చైల్డ్ హుడ్ గ్రూప్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక సంస్థ కార్యాలయంలో నియోజకవర్గ ప్రథమ స్థానం సాధించిన ఆకుల ప్రేమ్ సాయి, ద్వితీయ స్థానంలో నిలిచిన బావిశెట్టి కావ్య, తృతీయ స్థానంలో నిలిచిన మేడికొండ మోనాలను సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. గ్రూప్ సభ్యులు యాసం శోభన్‌బాబు, అలపర్తి గోపాలకృష్ణ, సామల్లి మల్లికార్జునరావు, బండే శ్రీను, డాక్టర్ కృష్ణమోహన్, అన్నపరెడ్డి కృష్ణ, అన్నపరెడ్డి పిచ్చియ్య, హనుమంతు శ్రీనివాస్, చన్నగిరి రాము, పర్చూరు మురళి, బండ్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్‌వేల నిర్మాణంతో ప్రమాదాల నివారణ



అధ్వానంగా ఉన్న ఫుట్‌బ్రిడ్జి మెట్లు

పెనమలూరు: బందరు రోడ్డు పై ట్రాఫిక్ విపరీతంగా పెరగటంతో ప్రమాదాల నివారణకు సబ్‌వేలు తప్పనిసరిగా అవసరం ఏర్పడింది. సిద్ధార్థ కాలేజీ, తాడిగడప జంక్షన్, పోరంకి సెంటర్, పెనమలూరు సెంటర్ ప్రాంతాల్లో సబ్‌వేల అవసరం ఎంతైనా ఉంది. సబ్‌వేలు నిర్మాణం చేస్తే జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాలు నివారించటానికి అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు. అదే విధంగా సర్వీస్ రోడ్ల ఆవశ్యకత కూడా ఉంది. నేషనల్ హైవే శాఖాధికారులు జాతీయ రహదారి పై జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు పై మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫుట్ బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయి. పది సంవత్సరాల క్రితం విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం చేశారు. అయితే మండల పరిధిలోని జనాభాను దృష్టిలో ఉంచుకోకుండా అశాస్త్రీయంగా రహదారి నిర్మాణం చేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి బందరు రోడ్డుకు ఇరుపక్కలా చాలా గ్రామాలు ఉండటంతో ప్రజల రాకపోకలు కూడా విపరీతంగా సాగుతున్నాయి. జాతీయ రహదారికి అండర్ పాస్‌లు కాని, సబ్‌వేల నిర్మాణం కానీ చేయలేదు. ప్రజలు బందరురోడ్డు దాటడానికి కేవలం కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, పెనమలూరు సెంటర్, గోసాల ఈడుపుగల్లు క్రాస్ వద్ద మాత్రమే ఫుట్ బ్రిడ్జిలు నిర్మించారు. మిగిలిన ప్రాంతాల్లో ప్రజలు నేరుగా నడుచుకుంటూ బందరు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మూడు ఫుట్ బ్రిడ్జీలు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. ప్రజలు అసలు ఈ వంతెనలను ఉపయోగించడంలేదు. వంతెన ఎత్తుగా ఉండటంతో ఎవ్వరు వంతెన మీదగా రోడ్డు దాటడానికి ఆసక్తి చూపటం లేదు. ప్రమాదం అని తెలిసినా నడుచుకుంటూ నేరుగా జాతీయ రహదారి దాటుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన వంతెనలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. రాత్రి సమయాల్లో వంతెన పైన కూర్చుని మద్యం సేవిస్తున్నారు. కనీసం లైట్లు కూడా లేక పోవటంతో ఎవ్వరు వంతెన పై నుంచి ప్రయాణం చేయటానికి సాహసించటంలేదు. ఫుట్‌బ్రిడ్జిలకు అడ్డుగా కట్టిన ఫ్లెక్సీలను అధికారులు వెంటనే తొలగించాల్సిన అవసరం ఉంది.

సంతకం ఫోర్జరీ చేశారని ఫిర్యాదు

పెనమలూరు: సంతకం ఫోర్జరీ చేసి తన భర్తతో పాటు పలువురు వ్యక్తుల సొమ్ము స్వాహా చేశారని ఫిర్యాదు అందటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి రామాపురం కాలనీకి చెందిన హనీరాణి ఉపాధ్యాయినిగా పని చేస్తోంది. ఆమె భర్త టి.ప్రసాద్ ఛత్తీస్‌గడ్‌లో పని చేస్తాడు. భర్త భార్య మధ్య కుటుంబ తగాదాలు ఉన్నాయి. కాగా తన భర్త తన సంతకం ఫోర్జరీ చేసి ఎల్ఐసీ హౌసింగ్ లోన్ 2011 సంత్సరం నుంచి పలు దఫాలుగా రూ.52.70 లక్షలు తీసుకున్నాడు. ఇందులో రూ.26.40 లక్షలతో ఇల్లు కొన్నాడని, మిగతా సొమ్ము రూ.26.30 లక్షలు ఇంటికి గాని, కుటుంబానికి కాని ఖర్చు చేయలేదని తెలిపింది. తన భర్త దుర్బుద్ధితో ఫోర్జరీ చేసి మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త చేసిన మోసంలో ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, ఏజెంట్ విజయ్, సాక్షిగా ఉన్న హఫీజ్, ఫీల్డ్ ఆఫీసర్ పాత్ర ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో ఇరువర్గాల మధ్య విలువైన ఆస్తి తగాదాలు జరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిని బెదిరించిన రౌడీషీటర్‌పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... కానూరులో ఓ ట్రస్టుకు సంబంధించి భూమిపై ఇరు వర్గాల మధ్య వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన అరవపల్లి రవికుమార్‌ను రౌడీషీటర్ కొక్కిలిగడ్డ జాన్‌బాబు బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఎంపీడీఓ విజయకుమార్‌కు సన్మానం



విజయకుమార్‌ను సత్కరిస్తున్న వాకర్స్

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఎంపీడీఓగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వీఏ విజయకుమార్‌ను సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం విజయకుమార్‌ను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో టైపిస్ట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి ఎంపీడీఓగా ఎదగడం విజయకుమార్ కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. ఉద్యోగ జీవితంలో ఆయన మరింతగా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. వాకర్స్ ప్రముఖులు కేఎస్. బాబూరావు, టీఎస్ఆర్‌కే ప్రసాద్, వీసం శ్రీనివాసరావు, ముక్కామల సుబ్బారావు, గంపా సాంబశివరావు, మున్వర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత సమాజానికి భక్తిభావం అవసరం



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ నేత పాకాల త్రినాథ్

పామర్రు: సమాజం శాంతియతంగా, సుభిక్షంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ అన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికతకు పట్టుకొమ్మల వంటి హిందు దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సమరసత మండల కన్వీనర్లకు ఆదివారం స్థానిక అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో హిందూ ధర్మ పరిరక్షణపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన త్రినాథ్ మాట్లాడుతూ మన దేవాలయాలు ఒకప్పుడు వైద్యాలయాలు, సాంస్కృతిక, ధార్మిక కేంద్రాలుగా విలసిల్లాయని అన్నారు.

ప్రజలలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు సమరసత సేవాసంస్థ సభ్యులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. మత మార్పిడిలు లేకుండా ఉండేలా బడుగు బలహీన వర్గాల కాలనీల్లో హిందూ దేవాలయాల నిర్మాణాలను చేపడుతున్నామని అన్నారు. ప్రతి కాలనీలో హిందు దేవాలయాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కృష్ణా జిల్లా సమరసత ధర్మప్రచారక్ ఆళ్ల జయశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ దేవరగట్ల నాగరాజకుమారి, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ నవీన్, సమరసత జిల్లా ప్రముఖ్‌లు పీఎంఎస్ ప్రసాద్, అరిగల బాలుడు, పానుగుమాటి లక్ష్మణరావు, ఆళ్ల రామిరెడ్డి, వంకా భవానీ పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



నాలుగు దశాబ్దాల నాటి చెలిమి బలిమి ఇన్నేళ్ల తర్వాత కూడా వారి స్నేహబంధాన్ని దృఢంగా నిలిపింది. దాదాపు నలభై వసంతాల తరువాత కలుసుకున్న వారంతా ఇప్పుడు తమ చిన్ననాటి మిత్రులను చూసి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి స్మృతులను తలపోసుకున్నారు. యాభై వసంతాలు దాటిన వారంతా ఒక్కసారి చిన్నపిల్లలై పోయారు. నాడు చేసిన చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకుని పడీపడీ నవ్వుకున్నారు. సంతోషాల హరివిల్లు విరియడంతో ఆ ప్రాంగణమంతా వింత వెలుగులు విరజిమ్మింది. మండల కేంద్రమైన ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో 1983–84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మరణించిన గురువులు, తోటి విద్యార్థులు వేమిరెడ్డి సత్యనారాయణ, శోభన్ బాబు, రాజేంద్రప్రసాద్, క్రీస్తురాజు, కుక్కమళ్ల ఏసుదాసులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం నాడు తమకు చదువు చెప్పిన గురువులు, తెలుగు పండితులు సూర్యదేవర రఘుపతిరావు, హిందీ పండితులు ముళ్లపూడి దత్తాత్రేయ వరప్రసాద్‌ను పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

– ఉంగుటూరు

ఉపాధి పనుల పరిశీలన



పామర్రు: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 5,208 మంది ఉపాధి కూలీలతో పనులు నిర్వహించామని ఏపీవో పొలు రాజు తెలిపారు. మండల పరిధిలోని పెదమద్దాలిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట బోదెలలో పూడిక తీత పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని తెలిపారు. ఈనేపథ్యంలో పంట బోదె తవ్వకం పనులు నాణ్యంగా ప్రమాణాలతో కచ్చితమైన కొలతలతో నిర్వహించాలని సూచించారు. కూలీల మస్టర్లలో ఏవిధమైన అవక తవకలు లేకుండా కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

